## క్లుప్తంగా

### హార్సిలీహిల్స్‌లో డీవీఎం తనిఖీలు

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీ హిల్స్‌లో టూరిజం తిరుపతి డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. డీవీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఇక్కడికి వచ్చారు. కొండపై జరుగుతున్న టూరిజం కార్యకలాపాలను పరిశీలించారు. రెస్టారెంట్, బార్, అతిథి గృహాలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. పర్యాటకుల సంఖ్య, ఆదాయం, అతిథిగృహాల బుకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఆధునీకరిస్తున్న అతిథి గృహం పనులను పరిశీలించారు. పర్యాటకులకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు.

### మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం మూరే వెంకట రమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30, 6.30 గంటలకు మల్లయ్యకొండకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

### బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రమాదేవికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె సిటీ: ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద ఆర్థికసాయాన్ని చెక్కుల రూపంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా బాధితులకు ఆదివారం అందజేశారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన కత్తి రమాదేవి, కొత్తపల్లిలోని కిశోర్, కోటూరుపల్లికు చెందిన రఘుపతి నీరజ, త్యాగరాజ వీధిలోని మడుగు శంకర, ఇందిరా నగర్‌కు చెందిన బి.లక్ష్మన్న, నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రావణి, కోళ్లబైలుకు చెందిన వెంకటేశ్వర్లు, వేంపల్లికి చెందిన శారదమ్మలకు చెక్కులను అందజేశారు.

### పీలేరు ఐఎంఏ సభ్యులకు పురస్కారం



అవార్డులు అందుకున్న డాక్టర్లు

పీలేరురూరల్: ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర ఐఎంఏ వార్షికోత్సవంలో పీలేరు ఐఎంఏ శాఖకు మూడు పురస్కారాలు లభించాయి. కలకత్తా ఆర్‌జీ కేర ఆస్పత్రిలో మహిళా వైద్యురాలి అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా పీలేరు పట్టణంలో నిర్వహించిన నిరసన, ర్యాలీకి సంబంధించి ఈ పురస్కారం అందింది. పీలేరు ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, ట్రెజరర్ డాక్టర్ ఈశ్వర సురేంద్ర, సభ్యులు డాక్టర్ వసీం అవార్డులు అందుకున్నారు. అలాగే ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో డాక్టర్ వసీంకు ప్రథమ బహుమతి లభించింది.

### సంస్థను బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

పీలేరు: భారతీయ అంబేడ్కర్ సేవ(బాస్) సంస్థను బలోపేతం చేద్దామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పిటిఎం.శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నందు బాస్ ముఖ్య ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 20వ తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకు బాస్ 12వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుంట శ్రీనివాసులు, రెడ్డెప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, గంగరాజు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్టు

ములకలచెరువు: పేకాడుతున్న శిబిరంపై దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్దపాళ్యం సమీపంలో పేకాడుతుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద రూ.27,570 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### గుండెపోటుతో జేఈ మృతి

రామసముద్రం: రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి(55) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మదనపల్లి వాటర్‌షెడ్‌లో జేఈగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి సిబ్బంది, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# కునుకు లేక...వణుకుతున్నారు



బస్టాండులో దుకాణం ఎదుట ఓ వైపున పడుకున్న వృద్ధుడు



ఆర్టీసీ బస్టాండు ప్లాట్‌ఫారంపై పడుకున్న నిరాశ్రయులు



చలికి వణుకుతున్న వృద్ధురాలు

చలిగాలులు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. అయినవాళ్లు లేక, ఆదరించేవారు కరవై ఎంతో మంది అభ్యాగులు రాత్రి వేళ చలికి వణుకుతూ రహదారుల పక్కన, బస్టాండ్ల ఆవరణలో తలదాచుకుంటున్నారు. రోడ్లపై మార్జిన్లలో చిత్తు కాగితాలు పరుచుకొని, చిరిగిన వస్త్రాలు కప్పుకొని మోకాళ్లను కడుపులో పెట్టుకొని ఎప్పుడు తెల్లరుతుందా? అంటూ కునుకుపాట్లు పడుతున్నారు. మదనపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, బెంగళూరు, చిత్తూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్, గొల్లపల్లె రోడ్డు, నీరుగట్టువారిపల్లె, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో శనివారం రాత్రి ×సాక్షి℉ క్షేత్రస్థాయి పర్యటనలో ఈ దృశ్యాలు కనిపించాయి. వృద్ధుల్లో అధిక శాతం మంది తమ బిడ్డల తిరస్కారానికి గురైన వారే. వీరిని అక్కున చేర్చుకోవాల్సిన బుగ్గ కాల్వ నిరాశ్రయ కేంద్రం ఎక్కడ ఉందో వారికి తెలియని పరిస్థితి.

– మదనపల్లె సిటీ

## కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు

మదనపల్లె సిటీ: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చునని సాంఘిక సంక్షేమశాఖ సహాయ అధికారి శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు రుచిర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత స్టడీ మెటీరియల్ ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, వాటిలో సందేహాలను ఉపాధ్యాయులకు చెప్పి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు పద్మావతమ్మ, హైమావతి, స్వర్ణలత, రుచిత ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్, నరసింహులు, దినేష్, రామాంజులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

తంబళ్లపల్లె: మండల కేంద్రమైన తూర్పు హరిజవాడలో 63 కెవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో ఏఈ శేష ప్రారంభించారు. లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారు స్పందించిన ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు.

## ప్రత్యేక ఓటరు నమోదు



పోలింగ్ కేంద్రం తనిఖీ చేస్తున్న తహసీల్దారు భీమేశ్వరరావు

పీలేరురూరల్: యువకులంతా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు అన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ మెయిన్ పాఠశాల, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయం, వెలుగు, సీఎల్ఆర్‌సీ కార్యాలయాల్లో ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 72 పోలింగ్ కేంద్రాలున్నాయని, ప్రతి కేంద్రం పరిధిలో బీఎల్‌వోలు ఓటరు నమోదు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర రెడ్డి, ఎన్నికల డీటీ చంద్రశేఖర్, హెచ్‌ఎం నటరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తుల రద్దీతో రెడ్డెమ్మ కొండ కిటకిట



రెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం అమ్మవారికి నమస్కరిస్తున్న మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకులు పంపిణీ చేసే ఆకు పసరు తాగిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానం చేసి తడిబట్టలతోనే దర్శించుకున్నారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతోపాటు ముస్లింలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. తమిళనాడు, కర్ణాటకతోపాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి తరలిరావడం విశేషం.

## రేపు శివ, కేశవుల కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 8:30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు ప్రముఖ పురోహితులు శశిధర్ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటల నుంచి అన్నమయ్య సంకీర్తనలు, 6:30 గంటలకు ఎదుర్కోళ్ల కార్యక్రమాలు ఉంటాయన్నారు. కాగా స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

## ఎన్సీసీలో చేరితే విద్యార్థులలో క్రమశిక్షణ



ఎన్సీసీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నిమ్మనపల్లె: ఎన్‌సీసీలో చేరితే విద్యార్థులు క్రమశిక్షణ నేర్వడంతోపాటు దేశభక్తి పెంపొందించుకుంటారని హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్, ఎన్‌సీసీ సీటీఓ వెంకట గోపాల్ అన్నారు. నిమ్మనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో ఆదివారం నేషనల్ క్యాడెట్ క్యాప్స్(ఎన్‌సిసి)డేను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మూడు దశల ఎన్సీసీ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల పాఠశాల విద్యార్థులు మణికంఠ, బాలు మహారాష్ట్ర ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి చేయడంతో వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పాపులమ్మ, మల్లప్ప, ఎస్ఎంసీ చైర్మన్ క్రిష్టప్ప హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి, పీసీ హరి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్షార్చన



పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మదిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప స్వామి లక్షార్చన మహోత్సవ కార్యక్రమాన్ని బీవీ రత్నం, రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, 7 గంటలకు మహాగణపతి పూజ, హోమం, 8.30 గంటలకు లక్షార్చన పూజ, 11 గంటలకు పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

## వనభోజనంలో.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరామయ్య

మదనపల్లె సిటీ: స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శంకర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వన భోజన మహోత్సవం ఉల్లాసంగా జరిగింది. ఆంజనేయస్వామికి విశేషాలంకారంతో అభిషేకాలు జరిపారు. జ్ఞానోదయ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. చిన్నారులచే గీతా పారాయణం, లలితా సహస్రనామం, భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. శంకర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు కోదండరామయ్య ఏటా కార్తీక వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాదరావు, కార్యదర్శి రఘునందన, రామకృష్ణ, గొల్లపూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మానవతా విలువలు పెంచాలి

కలకడ: మండలంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు మానవతా సభ్యులు హాజరై విద్యార్థులలో మానవతా విలువలు పెంచాలని మానవతా సంస్థ అధ్యక్షుడు పివి.నాయుడు కోరారు. కలకడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరలో మండల కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం ఫ్రీజర్ బాక్స్ ఉచితంగా అందించడమే తమ సంస్థ ధ్యేయం కాదని, వర్షాకాలంలో మొక్కలు పెంచడం, పర్యావరణాన్ని కాపాడటం ఉండాలన్నారు. కార్యక్రమంలో గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వైవి.రమణ, వెంకటసుబ్బయ్య, ఖాజాపీర్, సయ్యద్‌సాహెబ్, సుధాకర, వెంకటేశ్వరరావు, జివిరమణ, మోహన్, జయప్రకాష్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

### పంటకు చీరలే శ్రీరామరక్ష



చీడపరుగుల నివారణ, పంట రక్షణకు టమాటా సాగు చేసే రైతులకు చీరలే శ్రీరామరక్ష అయ్యాయి. పంట చుట్టూ ఇలా వందల చీరలు రక్షణ కవచంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇతర క్రిమి పురుగులు పంటలోకి ప్రవేశించకుండా, పశువులు, ఇతర వాటి నుంచి రక్షణ కల్పించేలా ఇవి ఉంటాయని రైతులు చెబుతున్నారు.

– కలకడ

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న పోలిశెట్టి దామోదరరావు

పీలేరురూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఎస్‌పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పోలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి.నరసయ్య అన్నారు. స్థానిక హుమయూన్ కల్యాణమండపంలో ఎంప్లాయిస్ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ భద్రతపై జారీ చేసిన సర్క్యులర్ నెంబర్ 01/2019ను ఆర్టీసీ ఉద్యోగులకు యథావిధిగా అమలు చేయాలన్నారు. 2022 నుంచి నిలిపివేసిన న నైట్ అవుట్ డైలీ అలవెన్సు వెంటనే చెల్లించాలన్నారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో 10 వేల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు డిపో ఈయూ గౌరవాధ్యక్షుడిగా కె.శ్రీనాథరెడ్డిని, ఉపాధ్యక్షుడిగా నారే సతీష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల ప్రభాకర్ యాదవ్, రమేష్‌కుమార్, రాధాకృష్ణ, రాజశేఖర్, కెవి.రమణ, బివిజి.రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్ నివారణే ప్రధాన లక్ష్యం



వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న సిబ్బంది

కేవీపల్లె: గర్భాశయ క్యాన్సర్ నివారణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నకమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 173 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో 35 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ డాక్టర్ పి.వి.బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీం, వలంటీర్లు షబ్బీర్, బాషా, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి



బహుమతుల ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ శిరీష

గుర్రంకొండ: వ్యాసరచన పోటీలతో విద్యార్థులు తమలో దాగిన సృజనాత్మకత పెంపొందించుకోవచ్చని ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ శిరీష అన్నారు. స్థానిక రీడ్ సంస్థ ఆధ్వర్యంలో నీతి కథలు అంశంపై విద్యార్థినులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో 58 విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల ప్రతిభ పాటవాలు వెలికితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తిక వన మహోత్సవం



మల్లికార్జున స్వామి ఊరేగింపు

పీలేరు: గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శివరామపురం సమీపంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనమహోత్సవం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవారి కల్యాణం చేసి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఫణీంద్రశర్మ, తెనాలి రామసుబ్రహ్మణ్యం, విరూపాక్షం కాశీనాథ్ పాల్గొన్నారు. అలాగే బలిజ సంఘ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా వన మహోత్సవాలు నిర్వహించారు.

## చిన్నకమ్మపల్లెలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



వరుడు దినేష్, తదితరులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు: కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం పర్యటించారు. రిటైర్డ్ లెక్చరర్ చంద్రయ్య కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, జయరామచంద్రయ్య, చక్రధర్, కేశవరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆనంద్, నాగభూషణం, మునీర్, అబీద్, షాకీర్, దావూద్, నాగార్జున పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ క్యాడెట్లకు సేవా దృక్పథం ఉండాలి



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి

కురబలకోట: ఎన్‌సీసీ క్యాడెట్లు సేవా దృక్పథం కలిగి ఉండాలని, అవసరమైనప్పుడు దేశ సేవలో భాగస్వాములు కావాలని కడప యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురష్కరించుకుని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ యవతలో క్రమశిక్షణ, దేశ భక్తి, కర్తవ్య భావాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగడానికి అది దోహదపడుతోందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫాం కలిగిన యువ సైనిక దళం ఎన్‌సీసీ అన్నారు. యువతీ యువకులను బాధ్యత కలిగిన తీర్చిదిద్దడంలో దీని కృషి ప్రశంసనీయమన్నారు. ఇందులో ఉన్నవారికి త్రివిధ దళాల్లో ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయన్నారు. యువతీ యువకులు ఎన్‌సీసీలో చేరి బాధ్యత గల పౌరులుగా దేశ రక్షణలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అధికారుల అలసత్వం

రాయచోటి అర్బన్ : విధుల నిర్వహణలో వసతి గృహ సంక్షేమాధికారుల అలసత్వం తగదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డైట్ పాఠశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాల్లోని వసతిగృహ సంక్షేమాధికారులకు బుధవారం సెలవు దినమైనప్పటికీ వారు ఆదివారం కూడా విధులకు హాజరుకాకుండా డుమ్మా కొడుతుండం దారుణమన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా బోగస్ అటెండెన్స్ వేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ విషయమై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు సైతం ముడుపులు పుచ్చుకుంటూ వసతిగృహ సంక్షేమాధికారుల పనితీరును పెద్దగా పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే తాము జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు హర్షవర్ధన్, జాహిద్, సాయి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలు ఇస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

సుండుపల్లె : మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ పర్యటనలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులలో పేర్కొన్న సమస్యలపై ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బస్టాండ్ కూడలిలో ఉన్న కూరగాయల దుకాణాలను, పూల అంగళ్లను, తోపుడు బండ్లను రోడ్లపై పెట్టరాదని సూచించారు. అలా కాదని ఎవరైనా అంగళ్లను రోడ్డుపై పెడితే నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అనంతరం వారపు సంతను సందర్శించి చెత్తాచెదారాలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అగ్రహారంలో నిర్మాణ దశలో పెండింగ్‌లో ఉన్న కొత్త సచివాలయాన్ని పరిశీలించారు. మెయిన్ రోడ్డు నుండి ఇండోర్ స్టేడియం వరకు సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయంలో ఇంటి పన్నుల రికార్డులను పరిశీలించారు. సురేష్ బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్తిక వనభోజనం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే కార్తిక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఓదివీడు గ్రామం మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ శివరామాంజనేయ స్వామి ఆలయ సముదాయంలో ఉన్న ఉసిరి చెట్టుకు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది కలసి తారతమ్యాలు మరిచి ఒకే చోట చేరి వివిధ రకాల వంటకాలు వండి పంక్తి భోజనం చేశారు. అనంతరం అందరూ కలసి వినోదంగా ఆటలు ఆడారు. కాసేపు కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.